క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కేశంపేట: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గురువారం ఏఈ ఈశ్వర్ తెలిపారు. మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో ఉన్న 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట, అల్వాల గ్రామ శివారుల్లో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని పుట్టోనిగూడ గ్రామంలో క్యాసారం పాండు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో జెడ్పీటీసీ మాజీ సభ్యులు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, జర్పుల రాజునాయక్ రూ.5వేల చొప్పున, మాజీ సర్పంచ్ జగన్‌నాయక్ రూ.4వేల ఆర్థికసాయంను మృతుడి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం అందించారు. కార్యక్రమంలో భాస్కర్‌నాయక్, నందు, నర్సింహ, రాజు, రమేశ్, కృష్ణయ్య, కుమార్, భాస్కర్, రెడ్యానాయక్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక నిర్మించాలని వినతి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురం(1, 9, 10వార్డులు)లో శ్మశానవాటిక నిర్మించాలని కోరుతూ గురువారం వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించడానికి పట్టణానికి వచ్చిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి వినతిపత్రం అందించాడు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సింగాపురం పరిధిలో మూడు వార్డులు ఉన్నాయని, ఇప్పటికీ శ్మశానవాటిక లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సమస్యను పరిష్కరించాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌కు సూచించారు. అదేవిధంగా సింగాపురం వెళ్లే ప్రధాన రహదారికి నిధులు లేక సగంలోనే రోడ్డు పనులు నిలిపివేయడం, మళ్లీ నిధులు కేటాయించి రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యేకి నాయకులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సుదర్శన్, రాజేశ్, దేవేందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

నివాళి

షాబాద్: మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామానికి చెందిన టీపీసీసీ కార్యదర్శి ఎస్.రాంరెడ్డి మాతృమూర్తి లక్ష్మమ్మ గత వారం క్రితం మృతి చెందింది. గురువారం నాగర్‌కుంటలో గల ఎస్‌వీఎస్ గార్డెన్‌లో ఆమె దశదినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి ఘన నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు, మొయినాబాద్ మండల అధ్యక్షులు మానయ్య, మంగలి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న నాయకులు

నందిగామ: మండల పరిధిలోని శ్రీనివాసులగూడలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రూ.50వేల విరాళం ప్రకటించారు. ఈ మేరకు విరాళానికి సంబంధించి నగదును గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి అడిగిన వెంటనే మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ విరాళం అందజేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజేందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, మల్లేశ్, కృష్ణయ్య, రవీందర్‌రెడ్డి, సతీష్, శ్రీను, రాంరెడ్డి పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ పనులు ప్రారంభం

షాద్‌నగర్‌రూరల్: మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందించేందుకు కృషి చేస్తామని మాజీ కౌన్సిలర్ శ్రావణి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని సీఎస్‌కే విల్లాస్‌కు తాగునీటిని అందించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో నిర్మిస్తున్న మిషన్ భగీరథ పైపులైన్ పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, జమృద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి సన్నద్ధం

- మండలంలో 4 లక్షల 10వేల మొక్కలు నాటడమే లక్ష్యం
- 41 నర్సరీల్లో పెంపకం
- పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు



షాబాద్ నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

షాబాద్: రాష్ట్రంలో అడవుల శాతం పెంచడంతో పాటు గ్రామాల్లో పచ్చదనం పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరిగాయి. వానలు కురవడమే ఆలస్యం.. మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్యశాలలు, కళాశాలలు, పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఒక్కో జీపీలో 10వేల మొక్కలు

మండలంలో మొత్తం 4 లక్షల 10 వేల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు గాను 41 పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచారు. ఒక్కో నర్సరీలో దాదాపు 10వేల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచారు. మొక్కల పెంపకం పనులను పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పర్యవేక్షించగా.. ఈజీఎస్ అధికారులతో పాటు ఎంపీడీఓ, ఎంపీఓ తదితరులు తరచూ సందర్శిస్తూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముందస్తుగా ముసురు వస్తుండడంతో మరో నాలుగు రోజుల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కలు నాటేందుకు వీలుగా గుంతలు తీసే పనులు చేపట్టనున్నారు. ఎంపీడీఓ అపర్ణ, ఏపీఓ వీరాసింగ్‌లు ఆయా నర్సరీలను సందర్శిస్తున్నారు. నిర్వాహకులకు పలు సూచనలు చేస్తున్నారు. వర్షాలు కురవగానే జూన్ 15 నుంచి మొక్కలు పంపిణీ చేసేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

వివిధ రకాల మొక్కలు

పంచాయతీ నర్సరీల్లో జామపండు, ఉసిరి, అల్లనేరేడు, చింత, మామిడి, సీతాఫలం, దానిమ్మ, కర్జూర, బాదాం, గులాబీ, మల్లె, మందారం తదితర మొక్కలు నర్సరీలో సిద్ధంగా ఉన్నాయి. గతంతో పోల్చితే ప్రజలకు ఇష్టమయ్యే వివిధ రకాల మొక్కల పెంచేలా చర్యలు తీసుకున్నారు.

మొక్కలు సిద్ధం



వన మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. నర్సరీల్లో అన్ని రకాల మొక్కలను నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. అవి వాడిపోకుండా గ్రీన్‌మ్యాట్ ఏర్పాటు చేయించాం. జూన్‌లో వర్షాలు కురవగానే మొక్కలు నాటడం ప్రారంభిస్తాం.

– వీరాసింగ్, ఏపీఓ

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



నర్సరీల్లో మొక్కల పెంపకానికి ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాం. ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటేందుకు వీలుగా ఖాళీ స్థలాల్లో గుంతలు తీసి, గ్రామాలకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేస్తాం. నిర్దేశించిన లక్ష్యాన్ని వందశాతం పూర్తి చేస్తాం.

– అపర్ణ, ఎంపీడీఓ

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఎంఈఓ మనోహర్



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మనోహర్, ఉపాధ్యాయులు

షాద్‌నగర్ రూరల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ మనోహర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని జీడివడకతండా, శేరిగూడ, నేరళ్లచెరువుతండా, తిమ్మాజిపల్లితండా, చిన్నచిల్కమర్రి గ్రామాల్లో ఎంఈఓ ఆధ్వర్యంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, సౌకర్యాలను వివరించారు. అనంతరం ఎంఈఓ మనోహర్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల మాదిరిగానే ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉంటుందన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందుతుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృష్ణయ్య, వెంకటయ్య, నర్సింలు, చంద్రోశేఖర్, జనార్దన్‌రెడ్డి, కృష్ణ, పతంజలి, సత్యం, సురేష్‌గౌడ్, మేఘాబాయి, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలి

తహసీల్దార్ అజాంఅలీ



మాట్లాడుతున్న తహసీల్దార్ అజాంఅలీ

కేశంపేట: ప్రభుత్వ నిబంధనల ప్రకారం, నాణ్యతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని తహసీల్దార్ అజాంఅలీ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇళ్లకు ఇసుక, ఇటుక, కంకర, సిమెంట్, స్టీల్‌ను ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే విక్రయించాలన్నారు. మండల మానిటరింగ్ కమిటీ ద్వారా రేట్లను తనిఖీ చేస్తారని తెలిపారు. ఇళ్ల నిర్మాణాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచించారు. మేస్త్రీలు, కూలీలు కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అధిక రేట్లు వసూలు చేయొద్దని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్కారు బడులను కాపాడుకోవాలి

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ వైఖరితో నిర్వీర్యమవుతున్న సర్కారు బడులను ప్రజలు కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రచార జాత గురువారం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా నిర్వీర్యం అవుతోందని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ వ్యవస్థలు విద్యను వ్యాపారం చేస్తూ రోజురోజుకు విద్యలో అంతరాలను పెంచుతున్నాయని మండిపడ్డారు. దీంతో పేద ప్రజలు నాణ్యమైన విద్యను కొనలేక తమ పిల్లల భవిష్యత్‌పై ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సమాన విద్య, వైద్యం అందాలంటే ఆ రెండు వ్యవస్థలు ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్నారు. ప్రజలే ముందుకొచ్చి విద్య, వైద్య రంగాలను కాపాడుకునేందుకు ప్రభుత్వాలను ప్రశ్నించాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు శివారెడ్డి, నర్సింలు, మండల అధ్యక్షుడు బిజిలి సత్యం, నాయకులు కృష్ణయ్య, సీఐటీయూ నాయకులు రాజు, ఈశ్వర్‌నాయక్, ప్రజా సంఘాల నాయకులు తిరుమలయ్య, నర్సింలు, రసూల్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలకు రక్షణ కల్పించడమే లక్ష్యం



సోలార్ ప్రాజెక్టు ఆవిష్కరణలో పాల్గొన్న సీఐఎస్‌టీ సభ్యులు

మొయినాబాద్: వన్యమృగాల నుంచి పంటలకు రక్షణ కల్పించడానికి కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల నూతన ప్రాజెక్టును ఆవిష్కరించింది. సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్(సీఐఎస్‌టీ) ద్వారా ఇంటిగ్రేటెడ్ స్మార్ట్ సోలార్ ఫెన్సింగ్ విత్ బ్లూ లైట్స్ ప్రాజెక్టును అభివృద్ధి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చింది. మండల పరిధిలోని సజ్జన్‌పల్లిలో గురువారం ఈ ప్రాజెక్టును కళాశాల సిబ్బంది ఆవిష్కరించారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సీఐఎస్‌టీ అసోసియేట్ హెడ్ బి.లింగం ఉన్నత్ భారత్ అభియాన్ నిధులతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. సజ్జన్‌పల్లిలో రైతు శ్రీకాంత్ పొలంలో ప్రాజెక్టును అమలు చేశారు. పంట పొలంలోకి అడవి పందులు, నక్కలు ఇతర వన్యమృగాలు రాకుండా నివారించేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ సాయి సత్యనారాయణరెడ్డి, ఉన్నత్ భారత్ అభియాన్ ఆర్‌సీఐ కోఆర్డినేటర్ డాష్, సీఐఎస్‌టీ అధిపతి సంయుక్త తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నర్సయ్య, సీఐఎస్‌టీ సభ్యులు శ్రీనివాస్, శేషప్ప, రవికుమార్, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల: వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కొప్పుల రాజశేఖర్‌రెడ్డిని పట్టణ బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఆ జిల్లాలో ఏర్పాటు చేసిన సన్మానసభలో వారు పాల్గొని ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, నాయకులు దేవుని శర్వలింగం, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భార్గవ్, అశోక్, అభిషేక్, మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి

మొయినాబాద్: రక్తదానం ప్రాణదానంతో సమానమని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు తరచూ రక్తం అవసరమని, అందుకోసం కళాశాల ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించి ప్రతీ సంవత్సరం 250 యూనిట్ల రక్తాన్ని అందిస్తున్నామన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ఈ సందర్భంగా 75 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ నర్సయ్య, సౌమ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రత్నాచారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తింపు పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనాలి

కొందుర్గు: రైతులు ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యంగా పత్తిసాగు చేసే రైతులు నాసిరకం విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. హెచ్‌టీ కాటన్(బీటీ3) విత్తనాలు అని రైతులను మోసం చేసి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గుర్తింపు పొందిన విత్తనాల కంపెనీ తయారు చేసి విక్రయించే ప్యాకింగ్ విత్తనాలనే కొనుగోలు చేయాలని, విధిగా రసీదు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రసీదుపై లాట్ నంబర్, ధర, కాలపరిమితి రాయించుకోవాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 8977753902 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే కాలె యాదయ్య



మొయినాబాద్: లబ్ధిదారురాలికి మంజూరుపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో పేదలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇందిరమ్మ కమిటీలు, అధికారుల సమన్వయంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజామొయినుద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ సర్పంచ్ రామకృష్ణగౌడ్, మాజీ ఎంపీటీసీలు యాదయ్య, లత, రాంరెడ్డి, నాయకులు మహేందర్‌ముదిరాజ్, రాఘవరెడ్డి, రాజుగౌడ్, చంద్రారెడ్డి, కృష్ణయాదవ్, యాదగిరిచారి తదితరులు ఉన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

శంకర్‌పల్లి: పట్టణ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య పిలుపునిచ్చారు. గురువారం మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పట్టణానికి మరిన్ని నిధులు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, నాయకులు వెంకట్రామిరెడ్డి, సాత ప్రవీణ్, ప్రకాశ్‌గుప్తా, పాండురంగారెడ్డి, చంద్రమౌళి, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంధ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దర్శన్, రంగారెడ్డి జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, పశువైద్యాధికారి దేవిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, నాయకులు మన్నె ప్రభాకర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, గొల్ల సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం

జాతీయ బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జలజ

షాద్‌నగర్‌రూరల్: సమస్యలను పరిష్కరించుకునేందుకు మహిళలందరూ ఐకమత్యంతో ఏకతాటిపైకి రావాలని జాతీయ బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో జాతీయ బీసీ సేన పట్టణ మహిళా అధక్షురాలు కాటం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జక్కుల జలజ మాట్లాడుతూ.. బీసీల ఓట్లతో అధికారం చేపట్టిన ప్రభుత్వాలు వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య వైఖరిని చూపుతున్నాయన్నారు. కులాలు, పార్టీలకతీతంగా మహిళలందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు బీసీసేన మహిళా కమిటీలను వేస్తున్నామని స్పష్టం చేశారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షురాలిగా పట్నం ఉదయరాణి, ప్రధాన కార్యదర్శిగా నందిగామ అరుణ, కార్యదర్శిరాలిగా విజయలక్ష్మి, సహాయ కార్యదర్శిగా పద్మావతి, కోశాధికారిగా లలితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు వారందరికీ నియామకపత్రాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జాతీయ బీసీసేన అసెంబ్లీ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖరప్ప, ప్రధాన కార్యదర్శి భూషం నరేశ్, మండల అధ్యక్షుడు మేకల వెంకటేశ్, నందిగామ మండల ఉపాధ్యక్షుడు నర్సింలు, చెన్న బాల్‌రాజ్, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

ఏడీఏ సురేశ్‌బాబు



చేవెళ్ల: సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సురేశ్‌బాబు

చేవెళ్ల: వానాకాలం సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో రైతులకు అనుమతి పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే అమ్మాలని విత్తన, ఫర్టిలైజర్ డీలర్లకు ఏడీఏ సురేశ్‌బాబు సూచించారు. పట్టణంలోని రైతు వేదికలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, డీలర్లతో కలిసి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్‌లు కలిగి ఉన్న డీలర్లు మాత్రమే రైతులకు విత్తనాలు, ఎరువులను విక్రయించాలన్నారు. ప్రతీ డీలర్ దుకాణం ఎదుట ఎరువుల స్టాక్‌ల వివరాలు, వాటి ధరల పట్టికలను బోర్డు రాసి పెట్టాలని తెలిపారు. రైతులకు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రసీదులను తప్పనిసరిగా అందించాలన్నారు. విత్తన దుకాణాల తనిఖీలకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసిందని, ఎప్పుడైనా తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. ఎక్కడైనా అవకతవకలు, నకిలీలు బయట పడ్డా వారి లైసెన్స్‌లు రద్దు చేయటంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ శిరీష హెచ్చరించారు. రైతులు రసీదులను తప్పనిసరిగా అడిగి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్, ఏఈఓ, మండలంలోని విత్తన, ఎరువుల డీలర్లు ఉన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

మొయినాబాద్: నకిలీ విత్తనాలు విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి అనురాధ హెచ్చరించారు. గురువారం మొయినాబాద్ రైతు వేదికలో డీలర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాపార ప్రయోజనాల కోసం నకిలీ విత్తనాలు అమ్మడం చట్ట విరుద్ధమన్నారు. అలాంటి డీలర్లపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే పీడీయాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ రైతులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. రికార్డులు సరైన పద్ధతిలో నిర్వహించాలని, ప్రతీ డీలర్ వద్ద ఉన్న స్టాక్, అమ్మకాలు, బిల్లుల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ కిషన్‌సింగ్, టెక్నికల్ ఏఓ సురేష్‌బాబు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులను ఇవ్వాలని ఆ సంక్షేమ సంఘం తాలుకా చైర్మన్ వెంకట్రామిరెడ్డి కోరారు. గురువారం సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల పోరాట ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందన్నారు. ఈ పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని, తాము అధికారంలోకి వస్తే ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి విస్మరిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గ కేంద్రంలో అమరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వారి కుటుంబాలకు 10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించడంతో పాటుగా, రాష్ట్రస్థాయిలో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, బాలునాయక్, జాంగారి రవి, రవికుమార్‌గౌడ్, జాంగారి నర్సింలు, అద్దెట్ల రాజు, మేకల వెంకటేశ్, సుధాకర్, వాహెద్, విఠల్, రావుఫ్, శివకుమార్, శివరాములు, మహేందర్, ప్రసాద్, సురేష్, మల్లేశ్, సాయిలు, శ్రీనివాసులు, ఎల్లోజి తదితరులు ఉన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత

ట్రాఫిక్ పోలీసుల పనితీరుపై అభినందన



రహదారిపై ఏర్పడిన గుంతలను జేసీబీ సహాయంతో పూడ్చివేయించిన ట్రాఫిక్ పోలీసులు

చేవెళ్ల: భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ట్రాఫిక్ పోలీసులు వర్షంలోనే జేసీబీ సహాయంతో మట్టి వేసి పూడ్చివేయించి శభాష్ అనిపించుకున్నారు. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మున్సిపాలిటీలోని హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై కేజీఆర్ గార్డెన్ ఎదుట భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వర్షం పడినప్పుడు గుంతల్లో నిల్వడంతో కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గమనించిన పట్టణ ట్రాఫిక్ సీఐ వెంకటేశం సిబ్బందితో కలిసి ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో జేసీబీ సహాయంతో మట్టిపోయించి చదును చేయించారు. తాత్కాలికంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ట్రాఫిక్ జామ్ కాకుండా చేశారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులు, స్థానికులు ట్రాఫిక్ పోలీసుల పనితీరును అభినందించారు. ఇకనైనా అధికారులు, నాయకులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.